ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా! మా విద్యార్థులు పవిత్ర హృదయులు, నిర్మల చిత్తులు, నిస్వార్థ హృదయులు, నిరహంకార స్వభావులు. స్వార్థమన్నది వారి చెంతకు ఏమాత్రమూ చేరటం లేదు. ఏదో కొంతమంది కొన్ని తప్పులు చేయవచ్చును. కాని, అవి వారికి వారే తిరిగి సవరించుకుంటారు. మా విద్యార్థులు చిన్నవారని మీరు భావించకండి.వీరి శక్తిసామర్థ్యములను ఎవ్వరూ వర్ణించలేరు. పనులన్నీ వారే చేస్తున్నారు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలే అన్ని పనులూ చేస్తున్నారు. కనుక, విద్యార్థులే మా సెంట్రల్ ట్రస్టు. వారు చేస్తున్న నిస్వార్థమైన పనుల గురించి చెప్పే నిమిత్తమై నేను నిల్చున్నానుగాని లేకపోతే ఈరోజు మీతో మాట్లాడాలని అనుకోలేదు. ఈ విద్యార్థులే భవిష్యత్తులో సెంట్రల్ ట్రస్టుకు చేదోడువాదోడుగా వుంటుంటారు. సెంట్రల్‌ట్రస్టు అంతా వీరిపైనే ఆధారపడి వుంది. అందరూ రాత్రంబవలు పనిచేస్తున్నారు. వీరు, వారు అని చెప్పటానికి వీలులేదు. అందరూ సమంగా కష్టపడి పనిచేస్తున్నారు.

విద్యార్థులారా! మీరే ఈ ట్రస్టుకు తగిన నాయకులుగా నిలచి, దీనిని సరియైన మార్గములో నడిపి ప్రపంచమునకు ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తున్నాను. భవిష్యత్తంతయూ మీపైననే ఆధారపడి ఉంటున్నది. మీయొక్క ఆదర్శము చేతనే ట్రస్టు అభివృద్ధి కావాలి. మనకు మనీ ప్రధానం కాదు. పని ప్రధానం. money comes and goes, morality comes and grows. మీయొక్క నీతినియమాలే మిమ్మల్ని ఉన్నత స్థాయికి తీసుకొని వెడతాయి. కనుక, morality ని అభివృద్ధి చేసుకోండి. మానవత్వంలో అనేకరకములైన ఊహలు, భ్రాంతులు కలుగుతుంటాయి. కాని, అన్నీ కదలిపోయే మేఘములవంటివే! వీటికి మీరు ఏమాత్రమూ లొంగిపోకూడదు. వీటిని ప్రక్కకు నెట్టి మీ శీలమును నిలుపుకునే ప్రయత్నం చేయాలి.

విద్యార్థులారా! మీయొక్క తేజస్సు, మీరు చేసే పనులు అన్నీ కూడను ఇతరులకు ఆదర్శప్రాయంగా వుండాలి. మీరు ఆదర్శంగా నిలిచినప్పుడే దానిపై ప్రపంచమంతా నిలుస్తుంది. ఈనాడు సైన్సు మరియు టెక్నాలజీ ఎన్నియో విధములుగా అభివృద్ధి చెందింది. కాని, ఇది కేవలం 'ట్రిక్ నాలెడ్జి'యేగాని, సరియైన టెక్నాలజీ కాదు. మీ హృదయమునుంచి వచ్చే సత్యనిత్యమైన భావాలను మీరు అనుసరించాలి. ఏది సత్యమో, ఏది అసత్యమో గుర్తించగలిగే విచక్షణా శక్తిని పెంచుకోవాలి. ఏది మనకు అనవసరమో దానిని ప్రక్కకు నెట్టాలి. ఏది సత్యమో, ఏది నిత్యమో దానిని మీరు అనుసరిస్తూ రావాలి. సెంట్రల్ ట్రస్టే కాకుండా మిగతా ట్రస్టులుకూడా మీ ప్రవర్తనపై ఆధారపడి వున్నవి. ట్రస్టు చేపట్టే పవిత్రమైన కార్యములందు మీ కాలమును సద్వినియోగపరచి, సత్కీర్తిని సంపాయించండి. మీరు ఇంకొకరిపై ఆధారపడనక్కరలేదు. మీ ఆత్మశక్తిపైన ఆధారపడి వుండాలి. ఆత్మవిశ్వాసమును బలపరచుకోవాలి. అదే మీకు సర్వస్వమును అదిస్తుంది. ఆత్మవిశ్వాసము గలవానికి అన్నింటిలోనూ విజయం గలుగుతుంది. ఆత్మవిస్వాసమే ప్రేమను బలపరుస్తుంది. ప్రేమయే మీకు సర్వవిధములైన శక్తిని చేకూరుస్తుంది. పని చిన్నదైననూ, పెద్దదైననూ ప్రేమచేతనే మీరు సాధించాలి. ఈ ప్రేమకు మీ విశ్వాసమే ప్రధానమైనది. కాని, ఈనాడు జనులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. 'నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి జనులు అవనియందు'. సత్యమే దైవం. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. సత్యము, ప్రేమ ఈ రెండూ మీరు సంపాదించుకోవాలి. ఈ రెండు కాళ్ళతోనే నేను నడుస్తున్నాను. వీటిని మనము సాధిస్తే లోకమునంతా సాధించవచ్చు.

బ్రిటీషువారు వున్నంతకాలము మద్రాసువారికి 'నీరిస్తాము, నీరిస్తామ'ని ఎంతగానో ప్రోమిస్ చేశారు. కాని, కట్టకడపటికి మొండిచెయ్యి చూపించారు. త్రాగునీటికోసం మద్రాసువారు పడుతున్న అవస్థ చూచి నేను వారికి కృష్ణా జలాన్ని అందించాను. ప్రతి ఒక్క గుడిసెకుకూడను ఇప్పుడు నీరందుతున్నది. ప్రతి పిల్లవాడుకూడా 'మాకు సాయిబాబా అమృతాన్ని అందించాడు' అంటూ ఆనందంతో గంతులోస్తున్నారు. మీరు నమ్ముతారో నమ్మరోగాని నేను చెప్పక తప్పదు. ప్రతి నెలా కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నాము. అది చక్రవర్తి(సెంట్రల్ ట్రస్టు సెక్రెటరీ)కి తెలుసు. ఈ డబ్బునంతా 'డిస్ట్రిబ్యూట్' చేయటం ఆయన పని. ఎవరో ఒకరు పనిచేయటానికి వుండాలికదా! స్వామియే అన్ని పనులూ చెయవచ్చును. కాని, కొంత 'హెల్పు'కూడా కావాలి. అందువల్లనే కొంతమందిని ట్రస్టు సభ్యులుగా పెట్టుకొని, ఆట్రస్టు సభ్యుల ద్వారా ఈ పనులు జరుపుతున్నాను. నేనెవ్వరినీ నయాపైసా అడగటం లేదు. మీకందరికీ బాగా తెలుసు. నేను ఇన్ని కార్యములు చేయాలనుకుంటే ఎంతమంది దగ్గరనుండో డబ్బు ఆశించాలి. కాని, ఎవ్వరినీ ఆశించటం లేదు. నా సంకల్పము సర్వశక్తిమంతము. మేము ధనమును ఆశించటం లేదు. గుణమును ఆశిస్తున్నాము. ప్రేమ ఒక్కటి వుంటే ఎన్నైనా సాధించవచ్చు. ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ఈ ప్రేమను మీరు సాధించండి. ప్రేమతో జీవితాన్ని గడపండి. ఎవ్వరినీ మీరు ఆశించనక్కరలేదు.ఆ ప్రేమయే మీకు అన్నీ సమకూరుస్తుంది. దేనికోసమూ మీరు కొరత పడకండి. అన్నీ ఆ ప్రేమయే మీకు అందిస్తుంది. తప్పుడు మార్గంలో పోకూడదు. అసత్యమాడకూడదు. అన్యాము చేయకూడదు. అసహనంగా ప్రవర్తించకూడదు. సహనమే చాలా ప్రధానమైనది. అందరూ కలసి మెలసి వుండాలి. వేదము చెప్పింది

సహనావవతు। సహనౌ భునక్తు।
సహ వీర్యం కరవావహై।

తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై।

మన భారతీయులలో ఐకమత్యము చాలా తక్కువ. అన్నీ వున్నాయి. కాని, 'యూనిటీ' లేకపోవటంచేత 'ప్యూరిటీ' లేకుండా పోతున్నాది. 'ప్యూరిటీ' లేకపోవటం చేత 'డివినిటీ' రాకుండా పోతున్నాది. 'డివినిటీ', 'ప్యూరిటీ' రెండూ వున్నప్పుడు మానవత్వంయొక్క కోరికలు సమస్తం నెరవేరుతాయి.

పిల్లలారా! నా మనసంతా నిరంతరము మీపైననే వున్నది. మీరు లేకపోతే నేను లేను. నేనుంటే మీరు, మీరుంటే నేను. 'ఐ అండ్ యు ఆర్ వన్'. మనం ప్రత్యేకంగా లేము. కనుక, 'స్వామి మాతో మాట్లాడటం లేదే' అని మీరు బాధపడకండి. సంతోషంగా పనిచేయండి.